సరస్వతి ఆలయంలో పూజలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతూ క్యాంపస్‌లోని సరస్వతి ఆలయంలో ఓయూ చైర్మన్ ఓరుగంటి కృష్ణ 108 కొబ్బరి కాయాలు కొట్టి పూజలు చేశారు. జాబ్ కేలండర్, స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీకి శంకుస్థాపన, రైతు రుణాల మాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ తదితర పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్, నగేష్‌నాయక్, సత్తి, నర్సింహ, అంజి, సింహాద్రి, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి

ఉస్మానియా యూనివర్సిటీ: స్వదేశీ ఉత్పత్తులు, వ్యాపారాలను ప్రోత్సహించాలని స్వదేశీ జాగరణ మంచ్ అఖిల భారత సంఘటన కార్యదర్శి కాశ్మీర్ లాల్ అన్నారు. ఓయూ గెస్ట్‌హౌస్‌లో స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబన భారత్ అభియాన్ అంశంపై శనివారం సదస్సు జరిగింది. బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధి తుళ్ల వీరేందర్‌గౌడ్ అధ్యక్షత వహించగా స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ మధ్య క్షేత్ర సంయోజక్ సత్తు లింగమూర్తి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో వీసీ ప్రొ.భట్టు సత్యనారాయణ, హరీష్ బాబు, రమేష్ బాబు, శ్రీనివాస్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

6న గద్దర్ ప్రథమ వర్ధంతి సభ

ఉస్మానియా యూనివర్సిటీ: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ప్రజా యుద్ధనౌక దివంగత గద్దర్ ప్రథమ వర్ధంతి సభను రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు వర్ధంతి సభ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. అధ్యాపకులు డా.పరుశురామ్, డా.ప్రేమయ్య, వెంకటేశ్వర్లు, బాలకోటి, మోడెం రవి, అర్జున్, డా.సమి పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ వర్గీకరణ మాదిరి బీసీ కులగణన జరగాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శనివారం డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. బీసీల కులగణన జరిగేలా సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయాలన్నారు. దేశంలో సమగ్ర కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ ఉంటుందని ఓయూ, టీఎస్ జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరి నాయక్ పేర్కొన్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట జాబ్ క్యాలెండర్ విడుదల చేసినందుకు బాణాసంచా కాల్చి శనివారం మిఠాయిలు పంచారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని ధ్వజమెత్తారు. సుభాష్‌రెడ్డి, రవీందర్ నాయక్, లక్‌పతి నాయక్, నరేందర్, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: డిగ్రీలు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొ.విజ్జులతను డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కామగోని శ్రావణ్ శనివారం కోరారు. విద్యార్థుల చదువు పూర్తయినా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదనే సాకుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. కోఠి ఉమెన్స్ కాలేజీలో ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లపై చదివే పేద విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకొని సర్టిఫికెట్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఓయూలో విజయోత్సవ ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూల తీర్పు ఇవ్వడంతో ఓయూలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్ట్స్ కాలేజీ నుంచి శనివారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు రిజర్వేషన్ల వర్గీకరణతో సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు పల్లెర్ల సుధాకర్, డా.నలిగంటి శరత్, పురుషోత్తం, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం తీరును తప్పుబట్టిన మాల జేఏసీ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి తీరును మాల పొలిటికల్ జేఏసీ నాయకులు తప్పుబట్టారు. జేఏసీ చైర్మన్ మంచాల లింగస్వామి మాట్లాడుతూ జనాభా లెక్కలపై సమగ్ర సమాచారం లేకుండా వర్గీకరణ ఎలా చేపడతారని ప్రశ్నించారు. అసెంబ్లీలో వర్గీకరణపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని సీఎం చెప్పడం అవగాహన లేకపోవడమే అన్నారు. స్థానిక ఎన్నికల్లో మాదిగల ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణపై అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు.

వయనాడ్ వరద బాధితుల కోసం..

సాక్షి, సిటీబ్యూరో: ప్రకృతి వైపరీత్యానికి గురైన కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులు, వారి కుటుంబీకులకు పలు రకాలుగా చేయూత అందించనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ నగర ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా మృతుల కుటుంబాల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని క్లెయిమ్ నిబంధనలను సడలించామని, బీమా పరిహారాల ప్రాసెస్‌ను త్వరితంగా పూర్తి చేసి అందించనున్నామని వివరించారు.

జాబ్ క్యాలెండర్‌పై నిరుద్యోగుల అసంతృప్తి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యూనివర్సిటీ లైబ్రరీ ఎదుట జాబ్ క్యాలెండర్‌కు వ్యతిరేకంగా శనివారం ధర్నా చేపట్టారు. జాబ్ క్యాలెండర్‌లో కొత్తగా ఏమీలేదని, ఎన్నికల మేనిఫెస్టో అంశాలే ఉన్నాయన్నారు. నిరుద్యోగులకు మద్దతుగా బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు మద్దతు తెలిపి పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు



ట్రోఫీ గెలుచుకున్న హెల్త్ హిట్టర్స్ జట్టు

రసూల్‌పురా: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధికారులు క్రికెట్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, చెస్, రంగోలి తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సికింద్రాబాద్ హెచ్‌సీఏ జింఖానా మైదానంలో కంటోన్మెంట్ చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ పోటీలు శనివారం నిర్వహించారు. బోర్డు సీఈవో మధుకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.

ఆ ఇళ్లు ఇక అంతేనా..

ఆక్రమణలో జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు

- రాజకీయ నేతలకు కాసులు కురిపిస్తోన్న వైనం..
- బేగంపేట ఓల్డ్ పాటిగడ్డ, ఎన్‌బీటీనగర్‌లలో ఇళ్ల దుస్థితి ఇదీ..



బేగంపేట్ ఓల్డ్ పాటిగడ్డలో నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు

సనత్‌నగర్: పేదల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఇళ్లు పాలకుల తీరును వెక్కిరిస్తున్నాయి. నిర్మించి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు అందించాలన్న చిత్తశుద్ధి మాత్రం కానరావడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఇదేవిధమైన వ్యవహారం కొనసాగుతుండటం సొంత ఇంటి కల కల్లగానే మిగిలిపోతోంది. బేగంపేట్ ఓల్డ్ పాటిగడ్డలో 2007 డిసెంబర్‌లో మొత్తం 193 మందికి జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెనెవల్ మిషన్(జేఎన్ఎన్‌యూఆర్ఎం) కింద ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో 176 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇళ్ల నిర్మాణం జరిగి పది సంవత్సరాలు దాటినా లబ్ధిదారులకు అందజేయలేదు. ఇదిలా ఉంటే అటు లబ్ధిదారులకు అందకుండా ఉన్న ఈ ఇళ్ల నిర్వహణ కూడా ఎవరూ చేపట్టకపోవడంతో అధ్వాన్నస్థితికి చేరాయి. కొన్ని బ్లాక్‌ల్లో ఇళ్ల కిటికీలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. సెక్యూరిటీ వ్యవస్థ కూడా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కూడా మారాయి. ఈ పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అంతా ఆక్రమణల పర్వం..

అటు అధికారికంగా కేటాయింపుల ప్రక్రియ జరగకపోవడంతో ఎవరి ఇష్టానుసారం వారు ఆక్రమించుకుని ఉంటున్నారు. ఈ ఇళ్లు కొంతమంది రాజకీయ నాయకులకు కాసుల వర్షం కురిపిస్తుండటం గమనార్హం. రాజకీయ పలుకుబడితో కొంతమంది ఆక్రమించుకుని సొంత జాగీరు అన్నట్లుగా అద్దెలకు కూడా ఇస్తుండటం గమనార్హం. గతంలో రెవెన్యూ అధికారులు పలు ఇళ్లకు తాళాలు వేసి సీజ్ చేసినప్పటికీ పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. ఇప్పుడు అన్ని ఇళ్లు అనధికారికంగా ఆక్రమించుకుని ఉంటున్నా అధికారులు ఏమీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఏదో ఒకటి రెండు ఇళ్లను సీజ్ చేశామని చెప్పుకోవడానికే తప్ప మిగతా ఇళ్లన్నీ ఆక్రమణలో ఉన్నాయనడంలో సందేహం లేదు.

ఎన్‌బీటీనగర్‌లో సైతం ఇదే పరిస్థితి..

బేగంపేట్ ఎన్‌బీటీనగర్‌లో జేఎన్ఎన్‌యూఆర్ఎం కింద జీ ప్లస్–3 విధానంలో 64 ఇళ్లను నిర్మించారు. 2008లో ప్రారంభించిన నిర్మాణాలు ఎట్టకేలకు పూర్తి చేశారు. అయితే ఇక్కడ కూడా కనీస వసతులు కల్పించాల్సి ఉంది. ఎప్పుడు కనీస వసతులు కల్పిస్తారో, లబ్ధిదారులకు అందే వరకు ఎంతకాలం పడుతుందో కూడా అర్థంకాని పరిస్థితి.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడలోని ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ స్థానికులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. యునైటెడ్ డి క్లాస్ బస్తీ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులను కలిసి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతూ ఎవరైనా ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్థానిక బస్తీ ప్రజలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్, కుట్టుశిక్షణ కేంద్రం ఇతర అవసరాల కోసం ఓ భవనాన్ని నిర్మించాలని స్థానికులు నిర్ణయించారన్నారు. అయితే కొందరు సదరు ఖాళీ స్థలాన్ని ఆక్రమించి దౌర్జన్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాలను తొలగించి స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా సదరు స్థలాన్ని కాపాడాలని కోరారు. అధికారులు సమస్యను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సమస్యలపై అలుపెరగని పోరాటం



మాట్లాడుతున్న కోట నీలిమ

సనత్‌నగర్: ప్రజా సమస్యలపై తాను రాజీలేని పోరాటం చేస్తానని టీపీసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ ముఖ్యనేతలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు డివిజన్లలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. జీహెచ్ఎంసీకి ఎన్నడూ లేనివిధంగా అత్యధికంగా నిధులు కేటాయించారని గుర్తుచేశారు.

ముగిసిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు



కార్యక్రమంలో నైనా జైశ్వాల్

రాంగోపాల్‌పేట్: యువత ఏకాగ్రతతో లక్ష్యం నిర్ణయించుకుని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ అన్నారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఏ రంగంలో రాణించాలన్నా ఏకాగ్రత, పట్టుదల, క్రమశిక్షణ ఎంతో అవసరమని విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని పోరాటపటిమతో విజయం సాధించాలన్నారు. అపజయాలు వచ్చినపుడు కుంగిపోవద్దని విజయం సాధించే వరకు శ్రమిస్తూనే ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షుడు గంపా నాగేశ్వరరావుతో పాటు పలువురు వ్యక్తిత్వ వికాస నిపుణులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సిద్ధం కావాలి

- జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్



సర్కిల్ కార్యాలయాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ జెడ్సీ రవికిరణ్

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ ఉత్తర మండలం పరిధిలోని ఐదు సర్కిళ్లలో పర్యావరణాన్ని పరిరక్షించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్ అన్నారు. జోనల్ కార్యాలయం పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులతో జెడ్సీ సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలను ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జీహెచ్ఎంసీ అధికారులు నిర్వహించే అంశాలపై సమావేశంలో కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయడంతో పాటు వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన మార్గదర్శక సూత్రాల ప్రకారం జోనల్ పరిధిలో 5 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి సర్కిళ్ల వారీగా అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ నెల 5వ తేదీన అన్ని ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించడం, చెత్త సేకరించి, బయటకు తరలించే వాహనాల డ్రైవర్లను కాలనీల్లోని గృహాల యజమానులకు అసోసియేట్ చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 6న దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. 7న నీటి వనరులను పరిరక్షించుకోవడం, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాలు సంరక్షించుకునే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 8న లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిల్వకుండా కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. 9వ తేదీన పార్కులు, మైదానాల్లో పర్యావరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు తొలగించడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు సమ్మయ్య, ఏ.మారుతిదివాకర్, హార్టికల్చర్, ఎంటమాలజీ విభాగాల అధికారులు రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్, సద్గుణ, ఐదు సర్కిళ్ల పరిధిలోని వార్డు కార్యాలయాల అడ్మినిస్ట్రేటివ్ అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునంద

లాలాపేట: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం వంటివని, ప్రసవించిన మొదటి గంటలోపు నుంచే పిల్లలకు పాలివ్వడాన్ని ప్రారంభించాలని సీడీపీఓ సునంద పేర్కొన్నారు. ఈ మేరకు తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు, శిశువులకు అన్నప్రాసన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. లాలాపేట సత్యానగర్ కమ్యునిటీహాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిక్కగా పసుపు రంగులో వచ్చే ముర్రుపాలలో వ్యాధి నిరోధకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. బిడ్డకు తల్లిపాలే ఉత్తమమైన ఆహారం అని ప్రతి తల్లి గుర్తుంచుకోవాలన్నారు. పాలివ్వడం వలన, బిడ్డకు, తల్లులకు కలిగే లాభాలను వివరించారు. బిడ్డకు పాలు పట్టే విధానంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు కృపావతి, సంధ్యారాణి, రోజారమణి, స్థానిక మహిళా నాయకురాలు తిరుమల రేణుక తదితరులున్నారు. శాంతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ చంద్రమణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

సనత్‌నగర్: యువతి అదృశ్యమైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. రసూల్‌పురా ఇందిరమ్మనగర్ బస్తీకి చెందిన విజయ్‌కుమార్, ఉషారాణి దంపతులకు వాణి(18), ప్రేమ్‌కుమార్(14), ప్రియ(10) ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె వాణి ఈ నెల 1వ తేదీన ఉదయం 11.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఇంతవరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తన కుమార్తెకు ఇన్‌స్టా గ్రామ్‌లో పరిచయమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ ప్రాంతానికి చెందిన దినేష్ అనే యువకుడితో వెళ్లినట్లు అనుమానం ఉందని విజయ్‌కుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు తమ కార్యాలయం ద్వారా వర్తింపజేస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ హామీ ఇచ్చారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని 5 మున్సిపల్ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం సీతాఫల్‌మండిలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలులో జరిగింది. దాదాపు 155 మందికి రూ.56 లక్షల విలువజేసే చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో ప్రతి ఇంటికీ వివిధ రకాల సంక్షేమ పథకాలను అందించేందుకు పదేళ్లుగా కృషి చేస్తున్నామని తెలిపారు. పేదల వైద్యానికి ఉపకరించేలా సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తుదారులు దళారులను ఆశ్రయించి డబ్బులు చెల్లించవద్దని అన్నారు. సీతాఫల్‌మండీలోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించి నేరుగా దరఖాస్తులు చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీతరమేశ్, లింగాని ప్రసన్నలక్ష్మిశ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రామేశ్వర్‌గౌడ్, ఆలకుంట హరిబాబు, కంది నారాయణ, రాజసుందర్, సునీల్ ముదిరాజ్, పి.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓలా ఎలక్ట్రిక్ బైక్ వినియోగదారుల ఆందోళన



ఆందోళనకు దిగిన ఓలా ఎలక్ట్రిక్ బైక్ వినియోగదారులు

సనత్‌నగర్: ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూం సర్వీసులు సరిగ్గా లేవంటూ బైక్ వినియోగదారులు బేగంపేటలోని షోరూం ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. ఓలా హటావో.. జాన్ బచావో.. అంటూ నినాదాలు చేశారు. బైక్ వినియోగదారుడు ఈశ్వర్ తమకు ఎదురైన అనుభవాలను వివరించారు. స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉండటం లేదని, సర్వీసింగ్ కోసం బైక్‌లను తీసుకువస్తే రోజుల తరబడి తమ వద్దే పెట్టుకుంటున్నారన్నారు. రన్నింగ్‌లో బైక్ సస్పెన్షన్ రాడ్ విరిగి తన కుమారుడు తీవ్ర గాయాలపాలయ్యాడని వాపోయారు. బైక్ మరమ్మతులు సరిగా చేయడం లేదన్నారు.

పరామర్శ

అమీర్‌పేట: కుమ్మరిబస్తీలో నివాసముండే బీఆర్ఎస్ నాయకుడు నరేందర్‌రెడ్డి మాతృమూర్తి, బీజేఆర్‌నగర్‌కు చెందిన చలిమెల రవికిరణ్ మాతృమూర్తి శుక్రవారం సాయంత్రం మరణించారు. విషయం తెలుసుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం ఉదయం వారి నివాసాలకు వెళ్లి పార్థివదేహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, పార్టీ నేతలు హనుమంతరావు, గులాబ్‌సింగ్, గోపీలాల్‌చౌహాన్, అశోక్‌యాదవ్, వనం శ్రీనివాస్, సంతోష్ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

విద్యార్థులు తెలివిగా ఓటు వేయడం నేర్చుకోవాలి



గౌతమ్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: పాఠశాలల్లో జరిగే ఎన్నికల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా వాటిపై అవగాహన కలుగుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. తిరుమలగిరి గౌతమ్ మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా వారిచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెలివిగా ఓటు వేయడం నేర్చుకుంటారన్నారు. పాఠశాల ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డీన్ సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ కల్పన, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్‌బీటీనగర్‌లో పర్యటిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

సనత్‌నగర్: బస్తీబాటలో భాగంగా బేగంపేట డివిజన్ ఎన్‌బీటీనగర్‌లో టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌బీటీనగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న హైటెన్షన్ తీగలతో తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా విద్యుత్ శాఖ అధికారులు వాటికి కేబుళ్లను అమర్చారు. ఈ సందర్భంగా డీఈ సుధీర్‌కుమార్ వాటిని పరిశీలించారు. నాణ్యత కలిగిన కేబుళ్లను ఏర్పాటు చేయడంతో వర్షం కురిసినా, గాలులు వీచినా ఎలాంటి ప్రమాదాలు జరగవని ఆయన తెలిపారు. అర్హులందరికీ గృహజ్యోతి పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీనిచ్చారు. ఎన్‌బీటీనగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నేత శేఖర్‌ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. డీఈ వెంట ఏడీఈ కిషోర్‌కుమార్, ఏఈ మధుసూదన్‌రావు ఉన్నారు.

సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన





రాంగోపాల్‌పేట్: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎంతో కీలకంగా వ్యవహరించే పోలీసులకు సీపీఆర్‌తో పాటు ప్రాథమిక చికిత్సపై అవగాహన అవసరమని కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. నేషనల్ బోన్ అండ్ జాయింట్ వారోత్సవాల సందర్భంగా కిమ్స్ ఆస్పత్రిలో తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ నగర పోలీసులకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్‌రావుతో పాటు సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రహదారులపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్కడికి ముందుగా వెళ్లేది పోలీసులే కాబట్టి క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటంలో వారు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీపీఆర్, ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. నార్త్‌జోన్ ఏసీపీ వెంకటేశ్వర్లు, వెస్ట్ జోన్ ఏసీపీ హరిప్రకాష్ వైద్యులు పాల్గొన్నారు.